నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 31 మార్చి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

చిరుత సంచారం వాస్తవమే..

- నాగర్‌కర్నూల్ ఫారెస్టు అధికారి పర్వీద్ అహ్మద్

నాగర్‌కర్నూల్, మార్చి 30 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో చిరుత సంచరిస్తున్నదని వస్తున్న వార్త నిజమేనని నాగర్‌కర్నూల్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పర్వీద్ అహ్మద్ తెలిపారు. మండలంలోని లట్టుపల్లి, గంగారం, మిట్యాతండా, భీమునితండా తదితర గ్రామాల్లో రెండు మూడు రోజులుగా రాత్రుళ్లు చిరుత సంచరిస్తున్నట్లు రైతులు గుర్తించి భయాందోళన చెందుతున్నారు. ఈక్రమంలో రాత్రి వేళ పొలాలకు కాపలా వెళ్తున్న వారు చిరుత గాండ్రింపులు విని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈక్రమంలో అటవీశాఖ అధికారులు చిరుత సంచరించిన ప్రాంతంలో దాని పాదముద్రలను శనివారం గుర్తించారు. చిరుత సంచారం వాస్తవమేనని, రైతులు పశువులను అడవిలోకి మేతకు తీసుకెళ్లవద్దని సూచించారు. రాత్రి పొలానికి కాపలా వెళ్లే రైతులు ఒకరిద్దరు కాకుండా గుంపుగా వెళ్లాలని సూచించారు. చిరుత పగటిపూట కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

పరీక్షలు అయిపోయాయోచ్..

18 నుంచి ప్రారంభమైన టెన్త్ ఎగ్జామ్స్ శనివారం సాంఘికశాస్త్రం పరీక్షతో ముగిశాయి. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొడుతూ పరీక్షా కేంద్రాల నుంచి బయటికొచ్చారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు పూర్తవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా రేపటి నుంచి ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలు కొనసాగనున్నాయి.

– వనపర్తి టౌన్, మార్చి 30

ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న రైతులు(ఫైల్)

గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల సందడి ప్రారంభం కానున్నది. వరి కోత దశకు రావడంతో వ్యవసాయశాఖ ఆదేశానుసారం కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈక్రమంలో రేపటి నుంచి ప్రారంభి ంచాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 823 కేంద్రాలను ఐకేపీ, మెప్మా, పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో మండలానికో సెంటర్ చొప్పున విడుతల వారీగా షురూ చేయనున్నారు. గ్రేడ్-ఏ రకం క్వింటాకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ధర ఖరారు చేశారు. ప్రభుత్వ కేంద్రాల్లో మద్దతు ధర లభించనుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– నాగర్‌కర్నూల్, మార్చి 30 (నమస్తే తెలంగాణ)

కొనుగోళ్ల సందడి

- రేపటి నుంచి ధాన్యం సేకరణ
- ఏ గ్రేడ్ క్వింటా ధర రూ.2,203
- సాధారణ రకానికి రూ.2,183గా ఖరారు
- ఐకేపీ, మెప్మా, పీఏసీసీఎస్‌ల ఆధ్వర్యంలో నిర్వహణ

రైతులు ఈ యాసంగిలో సాగు చేసిన వరి పంటలు చాలా వరకు కోతదశకు చేరుకున్నాయి. గతేడాది వానకాలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనగా ప్రాజెక్టులు, చెరువులు, కుంటల కింద ఆయకట్టు విస్తీర్ణం తగ్గింది. బోర్లు ఉన్న రైతులే ఎక్కువగా వరి సాగుకు మొగ్గు చూపారు. ఏప్రిల్ రెండు, మూడోవారం నుంచి ధాన్యం మార్కెట్‌కు వచ్చే అవకాశమున్నది. కాగా అదే సమయానికి అకాల వర్షాల ప్రభావం ఉండనున్నది. దీంతో ముందస్తు జాగ్రత్తగా వ్యవసాయ శాఖ ఏప్రిల్ ఒకటో నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నది. ఇప్పటికే వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలకు కొనుగోలు కేంద్రాల ప్రారంభంపై సూచనలు ఇచ్చింది. గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ, మెప్మాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 1న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు కచ్చితంగా ఏప్రిల్ 1న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఫలితంగా మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణలో కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం ప్రభుతం మద్దతు ధరలను కూడా ఖరారు చేసింది. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాకు ధర రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చొప్పున నిర్ణయించింది. సేకరించిన ధాన్యానికి సంబంధించిన నగదును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసేలా ఏర్పాట్లు చేపట్టారు. వారంలోగా ధాన్యం కొనుగోలు డబ్బులను రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు ఆదే శించారు. కాగా ఇప్పటికే గ్రామాల్లో ఏఈవోలు, మహిళా సంఘాలు, ఇతర అధికారుల ద్వారా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పి స్తున్నారు. మద్దతు ధరతో నేరుగా ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం విక్రయించి లాభం పొందాలని సూచిస్తున్నారు. అయితే దళారుల ప్రమేయం లేకుండా చర్యలు తీసు కోవాల్సిన అవసరం ఉన్నది. కొనుగోలు కేంద్రాల వద్ద దళారులతో కుమ్మకై రైతులకు మద్దతు ధర దక్కకుండా చేసే చర్యలను అధికారులు నియం త్రించాల్సి ఉంది. తేమ, తరుగు పేరుతో రైతులను గతంలో మోసం చేసిన ఘటనలు చాలా ఉన్నాయి. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలకు అధికార యంత్రా ంగం సన్నద్ధమవ్వడంతో కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణను అధికారులు విస్మరించే అవకాశం లేకపోలేదు. దీన్ని ఆయా సంఘాలు, దళారులు సొమ్ము చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన నాటి నుంచి చివరి గింజ సేకరించే వరకు నిరంతరం పర్యవేక్షణ చేయాలని రైతులు అభిప్రాయ పడుతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 64కేంద్రాలకు గానూ మొదటి విడుతగా 32 కేంద్రాలు, ఏప్రిల్ 10వ తేదీ తర్వాత మరో 32కేంద్రాలను ప్రారంభించ నున్నారు. నారాయణపేట జిల్లాలో 123, నాగర్‌క ర్నూల్‌లో 202, మహబూబ్‌నగర్‌లో 190, వనపర్తిలో 244 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 823 సెంటర్లు ప్రారంభం కానున్నాయి.

రేపటి నుంచి కొనుగోళ్లు షురూ..

జిల్లాలో ఏప్రిల్ 1న మండలానికొకటి చొప్పున కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నం. ఐకేపీ, మెప్మా, పీఏసీసీఎస్‌ల ఆధ్వర్యంలో 202 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. ఏప్రిల్ మూడో వారం నుంచి అన్ని కేంద్రాలకు ధాన్యం పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం ఉన్నది. దీనికి అనుగుణంగా కేంద్రాల ప్రారంభానికి ఆదేశాలు జారీ చేశాం. జిల్లాలో 1.10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నాం.

- ఉదయ్‌కుమార్, కలెక్టర్, నాగర్‌కర్నూల్

'పేట'లో 123 కేంద్రాలు

నారాయణపేట టౌన్, మార్చి 30: నారాయణపేట జిల్లాలో యాసంగి సీజన్‌లో పండిన ధాన్యం కొనుగోలుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే వరి కోతలు మొదలవగా.. ఉత్పత్తికి అనుగుణంగా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కృష్ణ, మాగనూర్‌తోపాటు ఇతర మండలాల్లో పలువురు రైతులు చేతికొచ్చిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. రాబోయే పదిహేను రోజుల్లో కోతలు మరింత ఊపందుకునే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర అందించనున్నారు. గ్రేడ్-ఏ రకం క్వింటాకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ధరతో కొనుగోలు చేయనున్నారు. ఇప్పటికే కలెక్టర్ శ్రీహర్ష వ్యవసాయ, పౌరసరఫరాల శాఖాధికారులు, మిల్లర్లకు సమీక్ష నిర్వహించి ప్రక్రియ పకడ్బందీగా జరిగేలా సూచనలు, సలహాలు అందజేశారు. కేంద్రాలను దశల వారీగా ప్రారంభించనున్నారు. సరిహద్దున ఉన్న కర్ణాటక నుంచి ధాన్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రతి ఏడాది అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేసేవారు. అయితే మేలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే చెక్‌పోస్టులు ఉన్నాయి. దామరగిద్ద మండలం కాన్‌కుర్తి, కృష్ణ మండలం చేగుంట, కృష్ణ బ్రిడ్జి, నారాయణపేట మండలం జిలాల్‌పూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులతో ధాన్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడనున్నది.

123 కేంద్రాల ఏర్పాటుకు..

యాసంగి సీజన్‌లో జిల్లాలో మొత్తం 70,209 మంది రైతులు 1,14,445 ఎకరాల్లో వరి సాగు చేశారు. మొత్తం 1,91,675 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారుల అంచనా.. అయితే రైతుల అవసరాలుపోనూ కేంద్రాలకు 1,35,610 మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉన్నది. ఇందుకోసం 123 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందిరా క్రాంతిపథం సంఘాల ఆధ్వర్యంలో 60, ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో 58, మెప్మా ఆధ్వర్యంలో 4, రైతుల ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఒక కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం 2,400 టార్పాలిన్లు అవసరం ఉండగా 1,500 అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. తేమ కొలిచే యంత్రాలు 192కుగానూ 175, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు 192కుగానూ 153, ప్యాడీ క్లీనర్లు 96కుగానూ 55 పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్నాయి. మిగతావి తెప్పించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో వరి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కొనుగోలు కేంద్రాలకు రైతులు ఆరబెట్టిన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి. తేమ శాతం 17 లోపు ఉండేలా చూడాలి. అన్ని సౌకర్యాలు కల్పించాం. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి. కొనుగోలు చేసిన డబ్బును రైతుల ఖాతాల్లో సకాలంలో జమ చేస్తాం.

- దేవదాస్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్, నారాయణపేట

ధాన్యం దొంగల ముఠా అరెస్టు

పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న నగదు

- పెబ్బేరులో పట్టుబడిన నలుగురు నిందితులు
- రూ.3.40లక్షల నగదు, వాహనం స్వాధీనం

పెబ్బేరు, మార్చి 30 : రైతులు ఆరబోసిన ధాన్యాన్ని లూటీ చేస్తున్న ముఠాను పెబ్బేరు పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలో తొమ్మిది చోట్ల చోరీలకు పాల్పడగా వారి నుంచి రూ.3.40లక్షల నగదు సహా వారు వినియోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. ఎస్సై కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని బాదేపల్లికి చెందిన కొయ్య ప్రణయ్‌రెడ్డి అదే ప్రాంతానికి చెందిన మరో ముగ్గురితో ముఠాగా ఏర్పడి ఈ తరహా చోరీలకు పాల్పడుతున్నాడు. శనివారం పెబ్బేరు జాతీయ రహదారిపై ఉన్న బైపాస్ వద్ద అశోక్ లేలాండ్ వాహనంతో ఈ నలుగురు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. ఈక్రమంలో అసలు గుట్టు అంతా బయటపడింది. వీరంతా జిల్లా పరిధిలోని చిన్నంబావి మండలంలో మూడు చోట్ల, కొత్తకోట, వీపనగండ్ల, శ్రీరంగాపురం, పాన్‌గల్ మండలాల్లో ఒక్కోచోట, పెబ్బేరు మండలంలో రెండు చోట్ల.. మొత్తం 9 ప్రాంతాల్లో ధాన్యాన్ని చోరీ చేసినట్లు అంగీకరించారు.

చోరీ చేసిన వడ్లను బాదేపల్లిలో విక్రయించి, ముఠా నాయకుడైన కొయ్య ప్రణయ్‌రెడ్డికి డబ్బు ఇస్తే ఆయన మిగతా వారికి నగదు పంపిణీ చేస్తాడని తేలింది. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

వంతెన ఎత్తు పెంచాలి



జాతీయర హదారిపైని రసనవ్యక్తం చేస్తున్న రాజోళి రైతులు

- అంతవరకు పనులు జరగనివ్వం..
- రహదారి నిర్మాణాన్ని అడ్డుకున్న రాజోళి రైతులు
- తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

రాజోళి, మార్చి 30 : రాజోళి మండలంలో నిర్మిస్తున్న భారత్‌మాల జాతీయ రాహదారి పనులను రాజోళి మండల రైతులు అడ్డుకున్నారు. రాజోళి నుంచి శాంతినగర్ వెళ్లే ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి ఎత్తును పెంచాలని వారు డిమాండ్ చేశారు. శనివారం రహదారి పనులను రైతులు అడ్డుకొని బ్రిడ్జి ఎత్తు పెంచాలని రహదారి అధికారులు డీజీఎం జనార్దన్, డీపీఎం రవిచంద్రను ఫోన్‌లో కోరారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాలని వారు సమాధానం ఇవ్వడంతో స్థానికులు మండిపడ్డారు. రైతులకు ఇబ్బందులు కలిగేలా పనులు చేపడితే పనులను అడ్డుకొని నిరసన చేస్తామని హెచ్చరించారు. మండలంలో సుబాబుల్, చెరకు, పత్తి పంటలు విరివిగా పండిస్తుంటారు. పక్క రాష్ట్రాల రైతులు కూడా తమ వ్యాపారాలను ఈ రహదారిపైనే కొనసాగిస్తుంటారు. బ్రిడ్జి 4మీటర్ల ఎత్తు ఉండడంతో పంట తరలించే వాహనాలకు ఇబ్బందులు తలెత్తుతాయని.. రైతులు అధికారులకు తెలిపారు. తమను దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జి ఎత్తును 8మీటర్లకు పెంచాలని, అంత వరకు పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని తాసీల్దార్ హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజోళి గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

జోరుగా క్రయవిక్రయాలు

- వేరుశనగ@ రూ.7,169

జడ్చర్ల, మార్చి 30: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. శనివారం వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగకు అత్యధికంగా క్వింటాకు రూ.7,169ధర పలికింది. 840క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.7,169 వచ్చింది. కనిష్ఠంగా రూ.4,265 మధ్యస్తంగా రూ.5,713 పలికింది. 73క్వింటాళ్ల ఆముదాలు అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.5,851ధర పలికింది. అదేవిధంగా మార్కెట్‌కు 68క్వింటాళ్ల జొన్నలు అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.5,177ధర పలికింది. 800క్వింటాళ్ల మొక్కజొన్న అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.2,239, 32క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.7,009ధర పలికింది. 34క్వింటాళ్ల రాగులు అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.4,059ధర పలికింది. మూడు క్వింటాళ్ల మినుములు అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.8,710, మూడు క్వింటాళ్ల పెసలు అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.4,059 ధర పలికింది. అదేవిధంగా మార్కెట్‌కు ఏడు క్వింటాళ్ల పొద్దుతిరుగుడు విత్తనాలు అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.3,760ధరపలికింది.

భార్యను హతమార్చిన కేసులో భర్తకు రిమాండ్

వనపర్తి, మార్చి 30 : భార్యను హత మార్చి కేసులో భర్తను శనివారం రిమాండ్ చేసినట్లు సీఐ నాగభూషణ రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి మండలంలోని ఎద్దులగేరికి చెందిన వెంకటేశ్ ఈ నెల 15వ తేదీన భార్య మల్లేశ్వరి (పద్మ) గొంతు పిసికి హత్య చేసినట్లు పోస్ట్‌మార్టం రిపోర్టు ఆధారంగా డాక్టర్లు తెలిపారు. దీంతో ఎద్దుల వెంకటేశ్‌పై హత్యా నేరం కింద కేసు నమోదు చేసికోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కుతర లించినట్లు ఆయన వెల్లడించారు.

ప్రజల పక్షాన పోరాడుతాం..

- తెలంగాణ సంస్కృతి గొప్పది
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ప్రజలనుమో సం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



ఫత్తేపూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు, మార్చి 30 : కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని ఆయన కోరారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం ఫత్తేపూర్‌లో శనివారం నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాల్లో శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె, గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు చాలా గొప్పవన్నారు. వీటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. తమ హయాంలోనే ఫత్తేపూర్ అన్ని రకాలుగా అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం ఎంపీ మన్నె మాట్లాడుతూ కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు ఓటు వేశారని, హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, ఫత్తేపూర్ ఎంపీటీసీ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ గౌడ్, సీనియర్ నాయకుడు రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరిపైరును ఎద్దులకు మేపుతున్న ఎల్లందొడ్డి రైతు

ఒట్టిపోతున్న బోర్లు.. ఎండుతున్న పైర్లు

- పశువులకు మేతగా పంటపొలాలు

గట్టు, మార్చి 30 : రైతుల పరిస్థితి కడుదయనీయంగా మారుతోంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటాయి. బోర్లల్లో నీరు ఇంకిపోతున్నది. మరికొన్నింట్లో చుక్క నీళ్లు రావడం లేదు. దీంతో యాసంగిలో సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎల్లందొడ్డి శివారులో పుండుకూర నాగప్ప బోరు ఆధారంగా ఎకరా పొలంలో వరి సాగు చేశాడు. పంట కోసం రూ.15 వేలకుపైగా పెట్టుబడి పెట్టగా.. పంట వేసి రెండు నెలలు దాటింది. బోరులో నీళ్లు బంద్ అయ్యాయి. దీంతో చేసేది లేక పొలాన్ని ఎండబెట్టాడు. పశువులు మేయడానికి వదిలేశాడు.

విస్తృతంగా తనిఖీలు

- పుల్లూరు టోల్‌గేట్ వద్ద రూ.1.85లక్షలు
- కృష్ణా బ్రిడ్జి వద్ద రూ.1.50లక్షలు పట్టివేత

ఉండవెల్లి, మార్చి 30 : ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.85లక్షలను సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పెరవల్లికి చెందిన రాంచందర్ శనివారం టోల్‌గేట్ మీదుగా కారులో మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నాడు. ఈక్రమంలో పుల్లూరు చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా అతడి వద్ద గుర్తించిన రూ.1.85లక్షల నగదును స్వాధీనం చేసుకొని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు ఎస్సై వెల్లడించారు. రాంచందర్ మహబూబ్‌నగర్‌లో ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆధారాలు లేకుండా నగదు తరలించొద్దు

మక్తల్ టౌన్, మార్చి 30 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తామని కృష్ణ ఎస్సై ఎండీ నవీద్ పేర్కొన్నారు. ఎస్పీ యోగేశ్ గౌతమ్ ఆదేశాల మేరకు మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణానది బ్రిడ్జి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక నుంచి కారులో వస్తున్న జహీరుద్దీన్ వద్ద రూ.1.50లక్షలను గుర్తించారు. నగదుకు సంబంధించి సరైన ధ్రువీకరణపత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి పంపినట్లు ఎస్సై వెల్లడించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు రూ.50వేలకు మించి తీసుకెళ్తే అందుకు సంబంధించిన రసీదులను వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

పుల్లూరుచెక్ పోస్ట్‌లో నగదును పట్టుకున్నపోలీసులు